మానసకు ధైర్యం చెబుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత

కురవి, మే 31: కురవి మండల కేంద్రానికి చెందిన మాసన ఇటీవల అమ్మను కోల్పోయి అనాథగా మారింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మానసను పరామర్శించి ధైర్యం చెప్పారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ. 5వేల ఆర్థికసాయం, దుస్తులు అందజేశారు. మానసకు అండగా ఉంటామన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు నరసింహారావు, విజయ్, ముత్యం వెంకన్న గౌడ్, సంగెం భరత్, శ్రీనివాస్, రఘు, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు

ఖిలావరంగల్, మే 31: వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హిందూ ధర్మప్రచార పరిషత్ ముద్రించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. హనుమకొండలోని అభయాంజనేయస్వామి, హంటర్ రోడ్డు, ములుగురోడ్డులోని రామాంజనేయ స్వామి ఆలయాలు, జయశంకర్ భూపాలపల్లి చిన్న గుంటూరుపల్లి, కాటారం, జనగామ, మహబూబాబాద్ జిల్లాలోని ఆలయాల్లో పూజలు ఉంటాయన్నారు. ఉదయం 6 నుంచి స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఆకు పూజ, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమాన్ జయంతి విశిష్టతను తెలిపే సత్సంగ్ ఉంటుదన్నారు. కార్యక్రమంలో టీటీడీ హనుమకొండ మేనేజర్ రఘువీర్, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మార్త రాజేందర్, తక్కెళ్లపల్లి సంపత్‌రావు, విద్యాసాగర్‌రావు, గునిగంటి సీతారామారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

డీఈవో రామారావును సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 31: గిరిజన ఉద్యోగులపై వివక్ష చూపుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావును వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై డీఈవో కక్షపూరితంగా వ్యవహరిస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నాడని అన్నారు. జిల్లా కార్యాలయం తోపాటుగా వివిధ మండలాల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులను ఏదో ఒకసాకుతో మెమోలు జారీ చేస్తున్నాడని చెప్పారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అనుమతి లేకుండా నడుస్తున్నాయని ఫిర్యాదు చేసినా డీఈవో పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనులపై చిన్నచూపు చూస్తున్న డీఈవో రామారావుపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 10న అన్ని కుల, విద్యార్థి సంఘాలను కలుపుకుని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. బాలాజీనాయక్, రమేశ్, హథీరాం, రామూనాయక్ పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

డోర్నకల్, మే 31 : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 2, 3, 4, 5, 6, 7వ నంబర్ ప్లాట్‌ఫాంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నందున గుంటూరు- సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -విజయవాడ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

డయాలసిస్ కోసం ఎదురుచూపులు?

ఏరియా వైద్యశాలలో ఐదే మిషన్లు

- రోజు దాదాపు 50 మందికే డయాలసిస్
- గతంలో పేరు నమోదు చేసుకున్న వారికే అవకాశం
- కొత్తవారికి నో చాన్స్
- మరో 50 మంది రోగుల పడిగాపులు
- ప్రాణాల మీదికి రావడంతో ఇతర పట్టణాలకు పరుగులు
- కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ల సంఖ్య పెంచాలని డిమాండ్

ఏరియా దవాఖానలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

మహబూబాబాద్ రూరల్, మే 31 : కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి డయాలసిస్ చేయడం తప్పనిసరి. ఇది ఖరీదుతో కూడుకున్న చికిత్స. వ్యాధి తీవ్రతను బట్టి ప్రతి రోజూ, వారానికి, నెలకు ఒకసారైనా డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. అయితే డయాలసిస్ రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అత్యాధునిక సౌకర్యాలతో ఐదు మిషన్లు అందుబాటులో ఉంచింది. దాదాపుగా రోజుకు 50 మంది వరకు ఎలాంటి ఖర్చు లేకుండా డయాలసిస్ చేస్తున్నారు. అయితే, క్రమక్రమంగా డయాలసిస్ చేయించుకొనే రోగుల సంఖ్య పెరుగుతుండగా, వారికి సంఖ్యకు అనుగుణంగా మిషన్లు అందుబాటులో లేక రోగులు అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి ఐదు డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రోజుకు సుమారు 50 మంది రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. ఒక్కో రోగికి డయాలసిస్ చేయడానికి సుమారు 4 నుంచి నాలుగున్నర గంటల సమ యం పడుతుంది. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారానికి 3 సార్లు లేదా 2 సార్లు, వారానికి ఒక్కసారైనా డయాలసిస్ చేస్తుంటారు. వీరే కాక జిల్లాలో మరి కొందరు డయాలసిస్ రోగులు ఉన్నారు. మరో 40 మంది బాధితులు డయాలసిస్ చేసుకోవడానికి ఎదురు చూస్తున్నా మిషన్ల సంఖ్య తక్కువగా ఉండడంతో వీరికి అవకాశం రావడం లేదు. ప్రాణాలమీదికి రావడంతో చేసేదేమీ లేక దూర ప్రాంతాలకు డబ్బులు ఖర్చు పెట్టి డయాలసిస్ చేయించుకున్నారు. గంటల తరబడి ప్రయాణం చేసి ఖమ్మం, వరంగల్ పట్టణాలకు వెళ్తున్నారు. దూరప్రాంతాలకు వెళ్లి మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి తగినన్ని డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్నా..

మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో డయాలసిస్ చేసుకొనే అవకాశం లేకపోవడంతో వరంగల్‌కు వెళ్తున్నా. మహబూబాబాద్ నుంచి బస్సులో పోవడానికి సుమారు 3 గంటలు, డయాలసిస్ చేసుకొని తిరిగి ఇంటికి రావడానికి మరో 3 గంటల సమయం పడుతున్నది. రోజుకు 6 గంటలు ప్రయాణం చేయడం వల్ల ఆరోగ్యం మరింత దెబ్బతింటున్నది. ఇంతకు ముందు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసేవాడిని. తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో దవాఖానకు వెళ్తే కిడ్నీలు పని చేస్తలేవని డాక్టర్లు తెలిపి డయాలసిస్ చేయాలన్నారు. వారానికి 3 రోజులు డయాలసిస్ చేసుకోవడానికి వరంగల్ వెళ్తున్నా. ప్రయాణంలో అలసిపోయి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నా. మరుసటి రోజు ఏ పని చేయలేకపోతున్నా. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో అడిగితే నీ కంటే ముందు 38 మంది డయాలసిస్ చేసుకోవడానికి పేరు రాయించుకున్నారు. వారి తర్వాతనే నీకు అవకాశం వస్తుందని సిబ్బంది తెలిపారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి డయాలసిస్ మిషన్ల సంఖ్యను పెంచాలి.

– ఇటుకాల ఉపేందర్, మహబూబాబాద్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..

ఏరియా వైద్యశాలకు రోజురోజుకూ డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతున్నది. డయాలసిస్ మిషన్ల కొరత ఉందని ప్రభుత్వానికి మూడుసార్లు ప్రతిపాదనలు పంపాం. డయాలసిస్ సేవలు అందించేందుకు నిరంతరం డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. దవాఖానలో ఉన్న ఐదు మిషన్లతో రోజుకు 50 మందికి డయాలసిస్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇంకో ఐదు మిషన్లను అందిస్తే వెయిటింగ్‌లో ఉన్న 40 మందికి, మరి కొంతమందికి డయాలసిస్ వైద్యం అందిస్తాం. – ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సబ్సిడీపై విత్తనాలు అందించాలి

నిరసన తెలుపుతున్న రైతుసంఘం సభ్యులు

కేసముద్రం, మే 31 : రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీపై అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు బట్టు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల ధాన్యాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ తక్ పట్టీ ఆధారంగా ధాన్యం అమ్మిన ప్రతి రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడం కారణంగా ప్రైవేటు కంపెనీలు నాసిరకం విత్తనాలు అంటగడుతూ రైతులను మోసం చేస్తున్నాయన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు కొట్టం అంజయ్య, బెజ్జంకి బ్రహ్మచారి, అంబటి నాగమల్లు, వాంకుడోత్ హథిరాం, బండి రాజు, కొమురయ్య, కొమ్మనబోయిన మల్లయ్య, వీరయ్య, ఓరుగంటి కృష్ణ, బెల్లి మురళి, దాసరి రాములు, సారయ్య పాల్గొన్నారు.

కురవిలో విచారణ చేపట్టిన డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష

బాలింత మృతిపై విచారణ

కురవి, మే 31 : గత అక్టోబర్ 29న వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో కురవి మండల కేంద్రానికి బాలింత స్రవంతి మృతిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష శుక్రవారం విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారిని అడిగి వివరాలు సేకరించారు. కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వీరాజిత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దంతాలపల్లి, మే 31: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో బాధిత కుటుంబాలను శుక్రవారం జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన కొండ ఎల్లయ్య, ఎర్ర వెంకనర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, గోడిశాల సంజీవ ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

కొత్తగూడ, మే 31 : ప్రభుత్వమే రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు భూర్క వెంకటయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడ మండల తహసీల్దార్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

కొత్తగూడ, మే 31 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ పేరుతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కావడంలేదన్నారు. తక్షణమే అమలు చేయకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకు రూ.2500 తదితర హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) గంగారం, కొత్తగూడ మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్, డివిజన్ గోంది సమ్మయ్య, మండల నాయకులు కంగాళ్ల పాపయ్య అప్పారావు, సూరి, రామయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MOHAMMED KHAJA SHAMSUDDIN GULRAIZ, S/o. MD KHAJA MOINUDDIN, R/o. H.No. 7-7-131, Ujili base, Hanamkonda, Warangal-Hanumakonda - 506011, T.S., India, have Changed my name to MD KHAJA SHAMSUDDIN and solemnly declare. NTW-00

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-327724

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు

- రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా

బయ్యారం, మే 31 : రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రం నుంచి తహసీల్దా ర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు విత్తన కంపెనీలు రైతులకు నకిలీ విత్తనాలకు అధిక ధరలకు అంటగడుతూ మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, మాట దాటవేయడం సరికాదన్నా రు. వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే కంపెనీలపై కఠిన చర్య తీసుకోవాలన్నారు. రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాలకు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. లేకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామగిరి భిక్షం, బానోత్ నరసింహ, ఉపాధ్యక్షుడు పూనం లింగన్న, సహాయ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు, సబ్ డివిజన్ నాయకుడు నాగేశ్వరరావు , మండల నాయకులు పాయం సమ్మయ్య, జీ భిక్షం, లింగమల్లు, బీ సంగన్న, ఐలయ్య పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో హెడ్ కానిస్టేబుల్ మృతి

మహబూబాబాద్ రూరల్, మే 31 : ఆర్థిక ఇబ్బందులతో హెడ్ కానిస్టేబుల్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల శివారులోని తాళ్లపూసపల్లి రోడ్‌లో శుక్రవారం జరిగింది. రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం.. గార్ల మండల కేంద్రానికి చెందిన బత్తిని మనోహర్ (50) పట్టణంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో కంట్రోల్ రూమ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు సంపత్, శ్రీకర్ అనే కొడుకులు ఉన్నారు. వీరి ఉన్నత చదువుల కోసం బంధువుల వద్ద అప్పు చేశాడు. అయితే ఉన్నత చదువులు చదివినా కొడుకులకు ఉద్యోగ రీత్యా ఇంకా స్థిరపడకపోగా, అప్పులు మాత్రం అలాగే పేరుకుపోయాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక మనోహర్ తీవ్రమనస్తాపం చెంది తాళ్లపూసపల్లి రోడ్ పక్కన ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. అతడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం హెడ్ కానిస్టేబుల్ మృతదేహం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియల కోసం పోలీస్ వెల్ఫేర్ తరపున రూ.20వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మృతదేహంపై పూలమాల వేస్తున్న ఎస్సీ సుధీర్ రాంనాథ్ కేకన్, (ఇన్‌సెట్)లో మనోహర్(ఫైల్)

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి

మహబూబాబాద్ రూరల్, మే 31 : పొగాకు ఉత్పత్తులను పూర్తి స్థాయిలో నిషేధించాలని సామాజిక వేత్త, వైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హస్తినాపురం కాలనీలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రదేశాల్లో పొగతాగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ శేఖర్, హనుమంతు, ఉప్పలయ్య, వాసుదేవ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆరోగ్య మిత్ర సంస్థ సభ్యులు

'బడిబాట'ను విజయవంతం చేయాలి

పెద్దవంగర, మే 31 : అధికారులు సమన్వయంతో పనిచేసి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అధికారులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమంలో అందరూ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కళాధర్, విజయ్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఏపీఎం రమణాచారి పాల్గొన్నారు.

హరిత వృక్షాలకు రక్షణేది?

చిన్నగూడూరు మే 31: మండలంలోని జయ్యారం శివారులో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నగూడూరు-జయ్యారం రహదారిపై బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయని అన్నారు. మొక్కల సంరక్షణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరిత వృక్షాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జయ్యారం శివారులో దగ్ధమైన హరితహారంలో నాటిన చెట్లు

నర్సింహులపేట: ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదు

దంతాలపల్లి మండల కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

బయ్యారం: పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్సై ఉపేందర్, ఏవో రంజీనాయక్

బయ్యారం, మే 31: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే షాపు లైసెన్స్ రద్దు చేయడంతోపాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్సై ఉపేందర్, ఏవో రాంజీనాయక్ అన్నారు. వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా మండలంలోని పలు విత్తన, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు.స్టాక్ రిజిస్టర్లు, క్యాష్ బిల్ బుక్, తదితర పత్రాలను పరిశీలించారు. మండలంలో నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు తప్పవని నమోదు చేస్తామన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో పోలీసుల తనిఖీలు

కొత్తగూడ: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తగూడ ఎస్సై దిలీప్ హెచ్చరించారు. కొత్తగూడ మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులపై పోలీసులు తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బిల్లులు లేకుండా రైతులకు విత్తనాలు, పురుగు మందులు ఇవ్వొద్దన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో శుక్రవారం రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులను పరిశీలించారు. అనుమతి లేని విత్తనాలు, విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్సై సతీశ్, ఏఈవో రామకృష్ణ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

దంతాలపల్లి : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై కరుణాకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఏవో కుమార్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రసీదులు పొందాలన్నారు.